సాక్షి
కర్నూలు
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తా రు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి నీలకంఠుడిని దర్శించుకున్నారు.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహి స్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమ వారం హైదరాబాద్‌కు చెందిన టి.నరహరిగౌడ్ రూ.1,11,111 విరాళం అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.65
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 92.782
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,782
అవుట్ ఫ్లో	: 5,563

ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు

- ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్
- చేయి తడపందే ముందుకు కదలని ఫైళ్లు
- లేకపోతే ఏళ్ల తరబడి ఆఫీస్ చుట్టూ తిరగాల్సిందే
- ఉద్యోగుల ఎస్టాబ్లిష్‌మెంట్‌కూ మామూళ్లే...



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి రోగం విజృంభిస్తోంది. ఇక్కడ పని చేసే కొందరు.. సాటి ఉద్యోగులు అని కూడా వదిలిపెట్ట కుండా మామూళ్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫైలు ముందుకు కదలాలంటే చేయి తడపాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా 12 పీహెచ్‌సీలు, 400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో పనిచేసే వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల జీతభత్యాలన్నీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచే నడుస్తాయి. ఆయా ఉద్యోగుల జీతభత్యాలు, పెండింగ్ జీతాలు, ఆడిట్లు, సర్వీసు వివరాల నమోదు తదితర ఎస్టాబ్లిష్‌మెంట్ సేవలకు ఈ కార్యాలయానికి వచ్చి పని చేయించుకుని వెళ్లాలి. పని త్వరగా కావాలంటే ఉద్యోగులు చెప్పినంత ముట్ట జెప్పుకోవాలి. లేదంటే ఏదో ఒక కొర్రి పెట్టి కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిప్పుకుంటూనే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. కారుణ్య నియామకాల విషయంలో సదరు కుటుంబ సభ్యులు పనిగాక కాళ్లరిగేలా ఈ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంటారు. కొందరికి మాత్రం ఒకటి, రెండు నెలల్లోనే ఆర్డర్ చేతికి వచ్చి ఉద్యోగంలో చేరి ఉంటారు. ఈ అంతరం మధ్య భారీగా మామూళ్లు చేతులు మారుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా తిరిగి సర్దుబాటు, డిప్యుటేషన్ పేరుతో ఇదే కార్యాలయంలో పనులు చేస్తుండటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్ల తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడి అసౌకర్యాలు, రోగులకు వైద్యం చేయకపోవడం, వైద్యులు, ఉద్యోగుల గైర్హాజరు, సమస్యలు ఏవీ బయటకు రాకుండా మామూళ్లతో మాయ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగానే ఇటీవల అధికారులు తరచూ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

➤ కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్, ఎస్‌ఆర్ పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి రెన్యూవల్ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు అధికారులు కొన్ని నెలలుగా తిప్పుకుంటున్నారు. ఆయా ఆసుపత్రుల్లో కొన్ని లోపాలను అడ్డుగా పెట్టుకుని రెన్యువల్ చేయడానికి తీవ్ర జాప్యం చేస్తున్నారని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాము ఉన్న లోపాలను సరిచేసుకున్నా రెన్యూవల్ చేయడం లేదని వాపోతున్నారు.

➤ ఇటీవల డీఆర్‌వో వద్ద జరిగిన ఎఫ్‌ఎన్‌వో విచారణతో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగే అవినీతి గురించి మరోసారి చర్చకు వచ్చింది. సదరు ఎఫ్‌ఎన్‌వోకు పదోన్నతి కావాలంటే నగదు లేదా నెక్లెస్ ఇవ్వాలని అడిగారని ఏకంగా ఆమె డీఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి కొందరు ఉద్యోగులు ఇక్కడే పాతుకుపోయి ఉండటంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి.

➤ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఉద్యోగి ఒకరు ఇటీవల కర్నూలు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. వైద్యం చేయించుకుని ఫీజులో మినహాయింపు ఇవ్వాలని సదరు ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరగా మీ ఆఫీసు వారు మా ఆసుపత్రికి అనుమతులు ఊరికే ఇస్తున్నారా... మీకు ఫీజులో మినహాయింపు ఇవ్వడానికి అని మొహం మీదనే కొట్టినట్లు చెప్పడంతో ఏమీ అనలేక సదరు ఉద్యోగి వచ్చేశాడు.



డాక్టర్ సీటు వెరీ హాట్...!

వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్ సీటంటే చాలా హాట్ అన్న చర్చ కొనసాగుతోంది. ఈ సీటును ఐదేళ్లకు పైగా ఒక్కరే చూస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అతను జిల్లాల విభజన సందర్భంలో నంద్యాల జిల్లాకు బదిలీ అయినా తిరిగి కర్నూలు కార్యాలయానికి డిప్యుటేషన్/సర్దుబాటు పేరుతో వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లకు సంబంధించి ఎస్‌ఆర్‌లు తెరవాలన్నా, ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్‌లు, ఈఎల్‌లు, మెటర్నిటీ లీవ్‌లు మంజూరు చేయాలన్నా, డిప్యుటేషన్లు ఇవ్వాలన్నా మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యాలయం చుట్టూ తిరగలేక సైలెంటుగా వైద్యులు మామూళ్లు ఇచ్చి తమ పని చేయించుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రిజిస్ట్రేషన్, రెన్యూవల్లకు ఇచ్చుకోవాల్సిందే..

ఈ శాఖలో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్‌కు చాలా డిమాండ్. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ గతంలో డెమో సెక్షన్ చూసేది. రెండేళ్లుగా ఓ ఉద్యోగికి ఆ బాధ్యతలు బదలాయించారు. స్కానింగ్ సెంటర్ల అనుమతులు మాత్రం డెమో సెక్షన్‌లోని ఉద్యోగులు నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌లో భాగంగా తాత్కాలిక, పర్మినెంట్, రెన్యూవల్లకు, స్కానింగ్ సెంటర్ల అనుమతులకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పలు సందర్భాల్లో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు లేవు. కార్యాలయం చుట్టూ తిరగలేమని ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేసుకుందామని పలు ప్రైవేటు ఆసుపత్రులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల విషయంలో ఎలాంటి తనిఖీలు చేయడం లేదు. మరోవైపు రోగుల నుంచి ఆయా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు భారీ ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో అబార్షన్లు, భ్రూణహత్యలు జరుగుతున్నా, స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ జరుగుతున్నా పదేళ్లకు పైగా ఒక్క కేసు కూడా నమోదు చేయని పరిస్థితి. ఆయా ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులు, ఉద్యోగులు అటువైపు చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు

వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిబంధనలకు అనుగుణంగానే ఏ ఫైల్ అయినా ముందుకు కదులుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఎంతటివారు చెప్పినా పని కాదు. ఈ విషయంలో కొంతమంది మా కార్యాలయంపై ఆరోపణలు చేస్తున్నారు. ఆసుపత్రులైనా, క్లినిక్‌లైనా, స్కానింగ్ సెంటర్లయినా ఉన్న లోపాలను సరి చేసుకోవాలి. ఉద్యోగులు సైతం వారి సర్వీసుకు సంబంధించి ఎలాంటి లొసుగులు లేకుండా చూసుకోవాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఏ ఒక్కరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. అన్నీ సక్రమంగా ఉండి ఆలస్యమైతే నేరుగా నాకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

న్యూస్‌రీల్

పంటల బీమాపై అవగాహన కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(సెంట్రల్): పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా వ్యవసాయాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పంటల బీమా పథకం 2024–25పై ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద శనగలు, జొన్నలు, వేరుశనగ, ఉల్లి పంటలకు డిసెంబర్ 15వ తేదీ వరకు, వరికి డిసెంబర్ 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. ఎకరం శనగకు రూ.420, జొన్నకు రూ.297, వేరుశనగకు రూ.480, ఉల్లిగడ్డకు రూ.1,350, వరికి రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకునే సమయంలోనే రైతులు ప్రీమియం చెల్లించవచ్చునని, రుణాలు తీసుకోని వారు రైతు సేవా కేంద్రాల ద్వారా చెల్లించాలన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18002093536, టాటాఏఐజీ ఇన్సూరెన్స్ క్లస్టర్ మేనేజర్ 9059634144ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ పాల్గొన్నారు.

నేడు పారామెడికల్ కోర్సు సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 3వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, రోస్టర్‌ను అనుసరించి సీట్లు భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

సమయానుసారంగా టీకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారంగా టీకాలు ఇప్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వ్యాధినిరోధక టీకాలపై ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి వైద్యాధికారి వారి పరిధిలో ప్రతి బుధ, శనివారాల్లో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. గర్భిణులు, పిల్లల జాబితా తయారుచేసుకుని వారికి సమయానుసారంగా ఇవ్వాల్సిన వ్యాధినిరోధక టీకాలను వంద శాతం అందేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యుహెచ్‌వో సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరుణ్ ధర్మన్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, డీపీఎంవో డాక్టర్ ఉమా, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

వణికిస్తున్న ఫెంగల్

- పెరిగిన ఈదురు గాలుల తీవ్రత



హొళగుందలో రైస్ మిల్లు వద్ద ధాన్యం బస్తాలపై తార్పాళ్లు కప్పిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. అయితే తుపాను ప్రభావం వల్ల ఈదురు గాలుల తీవ్రత పెరిగింది. కృష్ణగిరి, ఎమ్మిగనూరు, చిప్పగిరి, హొళగుంద, తుగ్గలి తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. చలి తీవ్రత పెరిగింది. సోమవారం ఉదయం నుంచే వాతావరణం మేఘావృతమైంది. సాయంత్రం నుంచి ఈదురు గాలుల ప్రభావం వల్ల చలి తీవ్రత పెరిగింది. ఈ పరిస్థితి ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కర్నూలులో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24.2 డిగ్రీలుగా నమోదైంది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు పడితే కంది పంటకు నష్టం కలిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కందిలో పూత, పిందె ఉంది. రబీలో సాగు చేసిన శనగ, జొన్న పంటలకు ప్రస్తుతం వర్షాలు కురిస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది.

కందుల కొనుగోలుకు రంగం సిద్ధం

- మార్కెట్ ధర రూ.10 వేలపైనే

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది కూడా మద్దతు ధరతో కందులను కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం కేంద్రప్రభుత్వ రంగసంస్థ నాఫెడ్ మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇచ్చింది. 2023–24లో కందుల ధరలు పెరిగిపోవడంతో భవిష్యత్ అవసరాలు, ప్రజాపంపిణీ కోసం నాఫెడ్ బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా దాదాపు 10 వేల క్వింటాళ్ల కందులు సేకరించింది. ఇప్పటికి కందుల ధర దిగిరాలేదు. ఈ సారి కందిలో దిగుబడులు పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడటంతో పూత మొత్తం రాలిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో నెల రోజులకు పైగా వర్షాలు లేకపోవడం, నేలలో తేమ పడిపోవడంతో కంది పంట చివరి దశలో దెబ్బతినింది. దీంతో దిగుబడులు తగ్గిపోయాయి. కందులకు కనీస మద్దతు ధర రూ.7,550 ఉండగా... మార్కెట్‌లో రూ.10 వేల వరకు ధర ఉంటోంది. ఈ ధర మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా నాఫెడ్ బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా కందులు సేకరించనుంది. మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటిస్తారో... మార్కెట్ ధరతో కొనుగోలు చేయడానికి కూడా అవే నాణ్యత ప్రమాణాలను పాటిస్తారు. కంది సాగు చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకొని ఈ–కేవైసీ చేయించి ఉండాలి. ఇటువంటి రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తారు. జిల్లాలో దాదాపు 75 వేల ఎకరాల్లో కంది సాగు అయింది.

రేషన్ డీలర్ల అక్రమ తొలగింపు అన్యాయం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేస్తున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): రాజకీయ కక్షతో రేషన్ డీలర్లపై అక్రమ కేసులు పెట్టి తొలగించడం అన్యాయమని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు మండలం మార్కాపురం డీలర్ ఘనమద్దిలేటి షాపులో ఉండాల్సిన నిల్వలకు సమానంగా రేషన్, కందిపప్పు, చక్కర ఉన్నా తహసీల్దార్ ఆకస్మిక తనిఖీల్లో 17.80 కేజీల బియ్యం లేదని చూపి కేసు కట్టడం అన్యాయమని కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

→ ప్రభుత్వం అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో పుట్టగొడుగుల్లా డయాగ్నొస్టిక్ సెంటర్లు వెలసి, ప్రజలను దోచుకుంటున్నా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు పట్టించుకోవడం లేదని అర్జీలో పేర్కొన్నారు.

→ కర్నూలు మండలం ఉల్చాల గ్రామా హిందూ శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల జిల్లా కార్యదర్శులు వై.నగేష్, అబ్దుల్లా కోరారు. దాదాపు 60 ఏళ్ల క్రితం గ్రామానికి సర్వే నంబర్ 443లో అప్పటి జనాభా అనుగుణంగా ఎకరా భూమి కేటాయించారని, అందులో 20 సెంట్లలో బండరాయి ఉండడంతో ఉపయోగం లేకుండా పోయిందని, మరో రెండు ఎకరాలను అదనంగా కేటాయించాలని విన్నవించారు.

→ కర్నూలు నగరంలోని 19వ వార్డు రామ్ ప్రియ నగర్‌కు మంచినీరు సరఫరా కావడం లేదని కాలనీ వాసులు రమేష్‌బాబు, వినోద్‌కుమార్, రంగారావు ఫిర్యాదు చేశారు.

→ నందవరం మండలం నాగులదిన్నె గ్రామ పొలిమేర సర్వే నంబర్ 142/2లో తనకు 93 సెంట్ల భూమి ఉందని, అయితే దానిని రికార్డుల్లో చుక్కల భూమిగా చూపుతుందని, వెంటనే తొలగించి సాధారణ భూమిగా మార్చాలని మేకల వలీసా అనే వ్యక్తి అభ్యర్థించాడు.

పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ ఆడిట్ పక్కగా నిర్వహించాలి

పొరపాట్లకు తావు లేకుండా పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ ఆడిట్‌ను పక్కగా నిర్వహించాలని చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ సీఎంఓ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టిమ్–పీజీఆర్ఎస్) గ్రీవెన్స్ ఆడిట్ నిర్వహణ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు సరైన ఎండార్స్‌మెంట్‌లు ఇవ్వాలన్నారు. ఆడిట్ పనులను కంప్యూటర్ ఆపరేటర్లతో కాకుండా సంబంధిత శాఖల హెచ్‌ఓడీలతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి దీప్తి పాల్గొన్నారు.



గర్జిలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు తరలివచ్చిన గ్రామస్తులు



ఆలయ ఆవరణలో సహపంక్తి భోజనం చేస్తున్న జనం



రాశిగా పోసిన అన్నం

గుడి భోజనం

- కార్తీక మాసం ముగింపులో ప్రత్యేకం

కార్తీక మాసంలో వన భోజనం చాలా మంది చేసే ఉంటారు. ఈ ఊరిలో కార్తీక మాసం ముగింపులో గుడి భోజనం ప్రత్యేకం. గుడి భోజనం అంటే ఆలయంలో అన్నదానం కాదు. ఈ భోజనానికి దాదాపు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం కులమతాలకు అతీతంగా గుడి భోజనం చేశారు. గ్రామంలోని అన్ని కులాల ప్రజలు తమ ఇంట్లో వండిన అన్నాని తీసుకొచ్చి గ్రామంలో వెలిసిన శ్రీ గర్జిలింగేశ్వరస్వామి ఆలయంలో రాశిగా పోస్తారు. అనంతరం ఆలయ ఆవరణలో తయారు చేసిన సాంబారుతో కలిపి ప్రజలంతా సహపంక్తి భోజనం చేస్తారు. ముందుగా గ్రామంలోని పలు ఆలయాల్లో వెలసిన దేవుళ్లకు గ్రామస్తులు నైవేద్యాన్ని సమర్పించిన తర్వాతనే ఇలా చేయడం వల్ల తమ గ్రామానికి ఎలాంటి అరిష్టం జరగకుండా ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ఉంటాయని గ్రామస్తుల నమ్ముతారు. ఇలా భోజనం చేస్తూ ఏటా కరువు కాటకాలను జయిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు.

– ఆదోని రూరల్

ఉద్యోగులెవ్వరికీ జీతాల్లేవ్

- ప్రభుత్వంపై ఉద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవ్వరికి నవంబరు నెల వేతనాలు జమ కాలేదు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినందున 1వ తేదీనే వేతనాలు పడతాయనే ఆశతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఉన్నా రు. 1వ తేదీ ఆదివారం కావడంతో జీతాలు పడలేదని రాజీ పడ్డారు. 2వ తేదీ కూడా వేతనాలు పడకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. విశ్రాంత ఉద్యోగులు కూడా పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని ఈ నెల 7వ తేదీ వరకు పనిచేయదని ఆర్థిక శాఖ సమాచారం ఇచ్చింది. దీన్ని బట్టి చూస్తే అప్పటి వరకు వేతనాలు పడే అవకాశం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలవుతున్నా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాల్లో ఒక్కటి కూడా చెల్లించలేదు. సర్కారు తీరు పట్ల ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోంది. కాగా వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉద్యోగులకు అక్టోబరు నెల వేతనాలే ఇంత వరకు చెల్లించలేదు. తాజాగా సీఎఫ్ఎంఎస్ టెక్నికల్ సమస్యల కారణంగా 7వ తేదీ తర్వాతనే వేతనాలు జమ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం

- సంపద సృష్టి అంటే జనంపై భారం మోపడం కాదు
- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆందోళన



ఎమ్మిగనూరు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: సూపర్ సిక్స్ హామీలను విస్మరించి విద్యుత్ చార్జీలు పెంచి పేదలకు కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని వైఎస్సార్‌సీపీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు గడ్డంనారాయణ రెడ్డి, విరూపాక్షిరెడ్డి, కౌన్సిలర్ నాగేషప్ప విమర్శించారు. ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ధర్నా చేపట్టారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సీఎం చంద్రబాబు ప్రభుత్వం రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమం అందిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నేడు ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో శాప్‌నెట్ వర్క్ రాష్ట్ర మాజీ చైర్మన్ మాచాని నాగరాజు, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, నాయకులు అల్తాఫ్, మురళి, విశ్వనాథ్ రమేష్, సోమేష్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, భాస్కర్ రెడ్డి, సోమేష్, సయ్యద్‌చాంద్, దేవరాజ్, మాబుబాషా, మహబూబ్‌బేగ్, సయ్యద్‌చాంద్, గట్టుఖాజ, చంద్రశేఖర్, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కంట్లో 'కారం'

- మిర్చి ధర పతనం.. ఆందోళనలో అన్నదాతలు
- మద్దతు ధర కల్పించని కూటమి ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): ఆరుగాలం కష్టించిన మిర్చి రైతుకు పెట్టుబడులు కూడా దక్కడం లేదు. మార్కెట్లో ధర పతనం కావడం.. కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ ఏడాది జిల్లాలో 95,477ఎకరాల్లో మిర్చి సాగైంది. ఆదోని, కౌతాళం, హొళగుంద, పెద్దకడబూరు, హాలహర్వి, ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, చిప్పగిరి, ఆలూరు, సి.బెళగల్ మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. నవంబరు రెండో వారం నుంచి మొదలైన దిగుబడులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతాయి. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర మూరెడు.. పెట్టుబడి బారెడు..

ఈసారి ధరలు పూర్తిగా పడిపోయాయి. మార్కెట్లో క్వింటా మిర్చి రూ.10 వేలకు మించి పలకడం లేదు. దీంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పంట దిగుడుబలు గోదాముల్లో పేరుకుపోవడం కూడా ప్రస్తుత మిర్చి దిగుబడుల ధరపై ప్రభావం చూపుతున్నాయిని రైతులు పేర్కొంటున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మిర్చి క్రయవిక్రయాలు జరుగుతున్నా.. ఉమ్మడి జిల్లాలో పండించే పంటలో 10–15 శాతం మినహాయించి మిగిలిన పంట మొత్తం గుంటూరు మిర్చి యార్డుకే వెళ్తోంది. ఈ ఏడాది పండించిన దిగుబడులకు క్వింటాల్‌కు రూ.10 వేలు, ఏసీ గోదాముల్లో నిల్వ ఉంచిన మిర్చికి రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు ధరలు ఉన్నాయి. కాగా పెట్టిబడి మాత్రం భారీగానే అయ్యిందని రైతులు చెబుతున్నారు. చీడపీడల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ, కూలీలకు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈలెక్కన క్వింటాల్‌కు కనీసం రూ.30 వేలైనా వస్తేనే గిట్టుబాటు అవుతుందని అన్నదాతులు ఆశిస్తున్నారు.



హొళగుంద మండలంలో సాగు చేసిన మిర్చి

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల బాగోగుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో సూపర్–6 పథకాల్లో భాగంగా ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గద్దెనెక్కి ఆరు నెలలవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఏ పంటకు కూడా గిట్టుబాటు ధరలు లేవు. అయినా మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి ప్రభుత్వానికి మనసొప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రికార్డు స్థాయిలో ధర

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మిర్చి సాగు రైతులకు కలిసొచ్చింది. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.56 వేల వరకు ధర లభించింది. 2022–23లో జిల్లాలో 1,29,575 ఎకరాల్లో మిర్చి సాగైంది. ఆ ఏడాది ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు రాగా బ్యాడిగ రకం క్వింటాల్‌కు రికార్డు స్థాయిలో రూ.56 వేల వరకు ధర లభించింది. 2023–24లో 1,51,098 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది అనావృష్టి పరిస్థితి నెలకొనడంతో ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.20 వేల వరకు ధర లభించింది. ఈసారి సాగు తగ్గిపోయింది. చీడపీడలు, నల్లతామర ప్రభావంతో మిర్చిలో నాణ్యత తగ్గే ప్రమాదం ఏర్పడింది. ధరలు మరింత అధ్వానస్థితికి చేరడంతో రైతుల ఆందోళన అంతా, ఇంతా కాదు.

ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చయింది



ఎకరా రూ.40 వేల చొప్పున 4 ఎకరాలు కౌలుకు తీసుకుని బ్యాడిగ రకం మిర్చి సాగు చేశాను. కౌలుతో సహా ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. కాపు బాగానే ఉంది. మొదటి కోతకు సిద్ధంగా ఉంది. అయితే ధర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం మిర్చికి కేవలం రూ.10 వేల వరకు మాత్రమే ధర పలువుతుండటంతో దిక్కుతోచడం లేదు. క్వింటాల్‌కు కనీసం రూ.30 వేల వరకు ధర లభిస్తే తప్ప గిట్టుబాటు కాదు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి.

– మౌలాసాబ్, హొళగుంద

పెట్టుబడి కూడా రావడం లేదు



ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు పెట్టుబడికే రూ.1.50 లక్షలు అయ్యింది. మార్కెట్లో మిర్చికి రూ.10 వేల వరకు ధర లభిస్తోంది. ఈ ధర ప్రకారం అమ్ముకుంటే పెట్టుబడి కూడ రాదు. కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర లభిస్తేనే గిట్టుబాటు అవుతుంది.

– ఎర్ర చిన్న భీమయ్య, బసలదొడ్డి, పెద్దకడబూరు మండలం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



కోడుమూరు రూరల్: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. చనుగొండ్లకు చెందిన శ్రీరాములు, రామేశ్వరి దంపతుల మూడో కుమారుడు శివ(26) గ్రామంలోనే పంక్చర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సోదరులకు, స్నేహితులకు గుడ్‌బై, ఇక సెలవు అంటూ మెసేజ్ పెట్టాడు. వారు తిరిగి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పంక్చర్ షాపు వద్దకు వెళ్లి చూడగా అక్కడ బైక్, షాపు సామగ్రి ధ్వంసం అయి ఉండటం గమనించారు. ఇదే విషయమై గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్యకు చేరవేయగా ఆయన సిబ్బందిని పంపి శివ ఫోన్ లొకేషన్ ఆధారంగా వర్క్కూరు పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. బైక్, పంక్చర్ షాపు సామగ్రి ధ్వంసమై ఉండటం, చనుగొండ్ల గ్రామం నుంచి 4 కిలోమీటర్లకు పైగా దూరంలోని వర్క్కూరు పొలాల్లోకి అర్ధరాత్రి వెళ్లి ఉరేసుకుని ఉండటంపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. ఎవరో తమ కుమారుడిని హత్య చేసి, ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని ఆరోపించారు. దీంతో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్‌ఐ శ్రీనివాసులు, గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని అడ్డవాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగరికి గాయాలయ్యాయి. సోమవారం తెల్లవారుజాము అరుణాచలం–హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కారు అడ్డవాగు దాటే క్రమంలో మరో వాహనం సడన్‌గా రావడంతో కారు వాగు బ్రిడ్జికి ఢీకొని వాగులో పడిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న విజయవాడకు చెందిన పద్మనాభం, శ్రీదేవి, దీప్తి, సోమశేఖర్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను శాంతిరామ్ ఆసుపత్రికి తరలించి కారును బయటకు తీశారు.

పశువుల కొట్టం ధ్వంసం



జేసీబీతో కొట్టాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామంలో సోమవారం ముల్లగుర్తి పెద్ద రామాంజనేయులుకు చెందిన పశువుల కొట్టాన్ని సోదరులే జేసీబీతో ధ్వంసం చేశారు. గ్రామ కంఠానికి చెందిన స్థలానికి పెద్ద రామాంజనేయులు గతంలో ప్రభుత్వ పట్టా పొంది పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ స్థలంలో భాగం కావాలని సోదరులు నడిపి రామాంజనేయులు, ఎర్రన్న, హరి డిమాండ్ చేస్తుండటంతో వారి మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. పెద్ద రామాంజనేయులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు కాగా సోదరులు టీడీపీలో ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఒత్తిడి భరించలేక పెద్ద రామాంజనేయులు కోర్టును ఆశ్రయించాడు. అయినా జేసీబీతో కొట్టాన్ని నేలమట్టం చేశారు. అధికారుల అండతో తన కొట్టాన్ని కూల్చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన సాయిలన్న

మంత్రాలయం: భిక్షాటన చేసుకుని బతుకు సాగిస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వివరాలివి.. మంత్రాలయం మండలం చెట్నిహళ్లి గ్రామం భీమరాయ తాత ఆలయంలో ఉంటూ జీవనం సాగిస్తున్న సాయిలన్న (50) సోమవారం రాత్రి కొండాపురం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. అభయ రాముడి విగ్రహం నుంచి ఎదురుగా ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం చెంతకు వచ్చేందుకు యత్నించాడు. మాధవరం నుంచి వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న సాయిలన్నను ఢీకొంది. తీవ్ర రక్త గాయాలు కావడంతో సాయిలన్న అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ పరమేష్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

8న క్రీడా జ్ఞాన పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ క్రీడాసాధికార సంస్థ ఆదేశాల మేరకు చైతన్య కస్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న క్రీడా భారతి అవార్డు కోసం నాల్గవ ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్ల పైబడిన వారు ఆన్‌లైన్‌లో (http://kreedaabharati.org) రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య పరీక్ష (సమయం 25 నిమిషాలు) ఉంటుందన్నారు. మొత్తం ప్రశ్నలు 50 ఉంటాయని, దరఖాస్తు చేసకున్న వారు కంప్యూటర్, ల్యాబ్‌టాప్, ట్యాబ్, మొబైల్, స్పోర్ట్స్ అవేర్‌నెస్ కోసం రూ.20 చెల్లించాలని పేర్కొన్నారు. క్రీడా పరీక్షల్లో మొదటి బహుమతి రూ.10 లక్షలు (ఒకరికి), రెండో బహుమతి రూ.50 వేలు (ఇద్దరికి), మూడో బహుమతి రూ.25 వేలు (ఆరుగురికి), నాల్గవ బహుమతి రూ.11 వేలు (11 మందికి) అందించనున్నట్లు వెల్లడించారు.

టెన్త్ విద్యార్థులకు వర్చువల్ క్లాసులు

కర్నూలు సిటీ/ఆదోని సెంట్రల్: పదవ తరగతి విద్యార్థులకు వర్చువల్ తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు సబ్జెక్టు నిపుణుల చేత బోధన చేసేందుకు డీఈఓ కార్యాలయంలో వర్చువల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ద్వారా వర్చువల్ తరగతుల నిర్వహణపై ఉన్నత పాఠశాలల కర్నూలు డివిజన్ ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో, ఆదోని డివిజన్‌కు సంబంధించి ఆదోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ రెండు సదస్సుల్లో డీఈఓ మాట్లాడుతూ ఈ ల్యాబ్ నుంచి ప్రతి రోజు సబ్జెక్టుల నిపుణులు విద్యార్థులకు మెలకువలతో కూడిన బోధన చేస్తారన్నారు. హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా పిల్లలు వర్చువల్ ల్యాబ్ ద్వారా చేసే బోధనను వినేందుకు అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు జిల్లా ఎంపికైందని, ఈ మేరకు జిల్లాలో 352 పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వర్చువల్ విధానంలో శిక్షణ ఇవ్వడానికి 22 మంది ఉపాధ్యాయులను కూడా నియమించామన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు హనుమంతరావు, వెంకటరమణారెడ్డి, ఏపీ హెచ్‌ఎంల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

ఆరుగురిపై వేధింపుల కేసు

గోనెగండ్ల: వివాహితను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తతోపాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. మండలంలోని గాజులదిన్నె గ్రామానికి చెందిన కురువ సుజాతను పత్తికొండకు చెందిన కురువ మల్లికార్జునకు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెళ్లైన కొద్ది రోజుల నుంచి భర్త మల్లికార్జునతోపాటు అత్త ఎల్లమ్మ, మామ మల్లికార్జున, మరిది లక్ష్మీకాంతం, ఆడపడుచు కామాక్షి, ఆమె భర్త సుంకన్న అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి


ఆత్మకూరు: విద్య ద్వారానే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బైర్లూటీ చెంచుగూడెంలో సామూహిక వనభోజనాలు ఏర్పాటు చేశారు. 300 మంది చెంచు గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులు గోర్లి సుధాకర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. చెంచు గిరిజన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బైర్లూటీ చెంచుగూడెం సర్పంచ్ గురువమ్మ, వీటీడీఏ ప్రెసిడెంట్ అంకన్న, తెలుగంగ రిజర్వాయర్ డీఈ పసుపులేటి వెంకటేశ్వర్లు, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి బత్తుల సంజీవరాయుడు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహనాయక్, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాంబాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు భోజనాలు వడ్డిస్తున్న జవహర్‌నాయక్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కర్నూలు(అర్బన్): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేంపెంట రాంబాబు కోరారు. సోమవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రజకులు అభివృద్ధి చెందాలంటే ఎస్సీ జాబితాలో చేర్చితేనే న్యాయం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సేవా సమితి కర్నూలు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు భారతి, విద్యార్థి నాయకులు కటారుకొండ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంబాబు

ఆస్తి రాసివ్వాలని వేధిస్తున్నాడు

- కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

కర్నూలు: ఆస్తి తన పేరు మీద రాసివ్వాలంటూ కుమారుడు శివశంకర్‌రెడ్డి వేధిస్తున్నాడని కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశాడు. కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి వారికి భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- బెంగళూరుకు చెందిన ఒరిజన్ ఇన్ఫోటెక్నాలజీ, కియోస్ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదులో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, రాకేష్, అశ్విని, కిరణ్ కుమార్‌లు నమ్మించి మోసం చేశారని, తాను డోన్‌లో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుండటంతో తనను నమ్మి తెలిసిన వారు 25 మంది రూ.50 లక్షల దాకా ఇచ్చి మోసపోయినట్లు కర్నూలు ముజఫర్ నగర్‌కు చెందిన ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- తన గుడిసెను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన నడిపి సుంకన్న ఫిర్యాదు చేశారు.
- మిగులు భూమి 2.50 ఎకరాల స్థలాన్ని బంధువులు ఈశ్వరయ్య, రాముడు కలసి ఆక్రమించుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు వాల్‌మార్ట్ పక్కనున్న జగదీష్ షాపింగ్ మాల్‌లో బాలాజీ ఆయుర్వేదిక్ సెంటర్ షాప్ నెం.215కు చెందిన గౌతమ్ అనే వ్యక్తి కాళ్ల నొప్పులతో బాధ పడుతున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నయం చేస్తామని నమ్మించి డబ్బులు తీసుకుని నకిలీ మందులు ఇచ్చి మోసం చేస్తున్నాడని కర్నూలు హౌసింగ్ బోర్డుకు చెందిన దేవభాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- ఆన్‌లైన్‌లో ఎలక్ట్రికల్ స్కూటర్ కొనుగోలు చేద్దామని ఫేస్‌బుక్‌లో వెతుకుతుండగా ఒక బుకింగ్ ఐడీతో ఎలక్ట్రికల్ స్కూటర్‌కు రూ.50 వేలు డిస్కౌంట్ వస్తుందని చెప్పి నమ్మించారు. రూ.89,500 ట్రాన్స్‌ఫర్ చేయించుకుని సైబర్ నేరగాళ్లు మోసం చేశారని కర్నూలు ఆదిత్య నగర్‌కు చెందిన చాంద్ బాషా ఫిర్యాదు చేశారు.



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ బిందు మాధవ్

ఎక్కువ మంది పిల్లల్ని కంటే మీరు పోషిస్తారా?

- సీఎం చంద్రబాబు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భగవత్‌కు బహుజన విద్యావంతుల వేదిక ప్రశ్న

కర్నూలు(సెంట్రల్): ఎక్కువ మంది పిల్లలను కనాలని చెబుతున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ఏపీ బహుజన విద్యా వంతుల వేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎక్కువ మంది పిల్లలను కంటే మీరు పోషిస్తారా? ఎంత మంది పిల్లలను కనాలో పాలకులే నిర్ణయిస్తారా? ఇది పురోగమనమా..తిరోగమనమా.. అని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డి.రామశేషయ్య సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఇది కచ్చితంగా తిరోగమనమేనని, ఎక్కువ మంది జనసంతో జనాభా ఆధారంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలను పెంచుకోవడానికి తప్పా మరో లాభం లేదన్నారు. ఈ విషయాన్ని మరిచి అత్యంత విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు ఎక్కువ మంది పిల్లలను కనాలని ఎలా పిలుపునిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే దేశం ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని, ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల నుంచి తప్పుకోవడంతో ఉన్న ఒక్కరిద్దరు పిల్లలకే సరైన సదుపాయాలు కల్పించలేకపోవడంతో పౌరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో ఎక్కువ మంది సంతానం ఎందుకని ఆయన ప్రశ్నించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

డోన్ టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో సీనియర్ సివిల్ జడ్జి తంగమణి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తీర్పు వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన ఉప్పరి ఈశ్వరయ్య అలియాస్ బండల ఈశ్వరయ్యకు బోయ ఈశ్వరయ్యకు మధ్య ఆర్థిక లావాదేవీల విషయమంలో వివాదం ఉండేది. దీంతో గత జూన్ 12న బండల ఈశ్వరయ్య గుత్తి రోడ్డులోని మారుతీ షోరూంకు ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్ షాప్ వద్ద ఉండగా బోయ ఈశ్వరయ్య మరో నలుగురితో కలిసి కత్తితో దాడి చేశారు. గాయపడిన బండల ఈశ్వరయ్యను స్థానికులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స అనంతరం కోలుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐదుగురి నిందితులను ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం బోయ ఈశ్వరయ్యపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి తీర్పు వెలువరించారు. మిగతా నలుగురిపై కేసు కొట్టివేశారు. కాగా 2009లో ఒక హత్యాయత్నం కేసుతోపాటు మరో రెండు వేర్వేరు కేసులు, ఇటీవల దొరపల్లె వద్ద భూమి ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన కేసుల్లోనూ బోయ ఈశ్వరయ్య నిందితుడిగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, మమత పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): బడికి ఐదు రోజులుగా ఎందుకు వెళ్లలేదని తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తెలుగు మద్దీ శేఖర్‌కు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు ఎల్లకృష్ణ(10) వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చుదువుతున్నాడు. ఐదు రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో కుమారుడిని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై పంట పొలాలకు పిచికారీ చేసేందుకు తెచ్చిన మందు ఇంట్లో ఉండటంతో దాన్ని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూలు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు.



మృతి చెందిన ఎల్లకృష్ణ

తులసీదేవికి అదనపు బాధ్యతలు

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే.తులసీదేవికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జేడీగా కొనసాగుతున్న జే.రంగలక్ష్మీదేవి వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 15వ తేదీ వరకు సెలవుపై వెళ్లిన కారణంగా తులసీదేవికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. సాంఘిక సంక్షేమంతో పాటు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలను కూడా తులసీదేవి నిర్వహించాల్సి ఉంది.





సోమవారం చాగలమర్రిలో నిర్వహించిన ప్రజా వేదికలో సూపర్‌వైజర్ సుశీలమ్మ ఒక్కరే హాజరైన దృశ్యం

నిండా నిర్లక్ష్యం

- పీజీఆర్‌ఎస్‌కు అధికారుల గైర్హాజరు

అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పట్ల కొందరు అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు తమను ప్రశ్నించలేరని ధీమానో.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనో ఏమో కానీ కొందరు అధికారులు ఇష్టమొచ్చినప్పుడు హాజరవుతుండగా మరికొందరు ఏకంగా గైర్హాజరవుతున్నారు. సమస్య చెప్పుకుందామనే ఆశతో పల్లెల నుంచి మండల కేంద్రాలకు వచ్చిన ప్రజలకు.. తమ సమస్య వినేనాథుడు లేడని, కనీసం ఫిర్యాదు స్వీకరించే అధికారి కూడా రాలేదని తెలిసి, ఏమీ చేయలేక నిట్టూర్పుతూ వెనక్కెళ్తున్నారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదా అధికారులు లేని కార్యక్రమం ఎందుకని పలువురు ప్రశిస్తున్నారు.

– సి.బెళగల్/చాగలమర్రి



సి.బెళగల్లో నిర్వహించిన ప్రజావేదికకు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాత్రమే హాజరైన దృశ్యం



కోటేష్ వేసిన చిత్రం

కుక్క కాటుకు చార్ట్ దెబ్బ!

ఇటీవల హైదరాబాద్ అంబర్‌పేటలో ఐదేళ్ల బాలుడిని వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి. విజయవాడ భవానీ నగర్‌లో ముగ్గురు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఎన్‌టీఆర్ జిల్లా పెగుగంచిప్రోల్‌లో ఏడాది చిన్నారిని కుక్కలు కరిచి చంపాయి. రోజూ ఏదో ఒక చోట ఇలాంటి వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. కుక్కల దాడిలో చనిపోయిన చిన్నారుల తల్లిదండ్రుల వేదనను నంద్యాలకు చెందిన చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ చిత్రరూపమిచ్చారు. డ్రాయింగ్ చార్ట్‌పై కాఫీ కప్పు ఒలికినట్లు, ఒలికిన కాఫీ కుక్కల దాడి ఘటనను వివరిస్తున్నట్లు గీచిన ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంటోంది.

– నంద్యాల(అర్బన్)